సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



తాగినడిపితే బీమా కట్!

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇకపై మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే బీమా రాకుండా చేస్తోంది. 8లో▸




గోధుమకు దక్కని 'మద్దతు'

జిల్లాలో గోధుమ పంట చేతికి వస్తున్నా మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మద్దతు ధర అందడం లేదని పలువురు పేర్కొంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) జిల్లా కార్యవర్గాన్ని శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాగిరి దయాకర్, ప్రధాన కార్యదర్శిగా ముమ్మడి నర్సింగ్‌రావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఆయా కళాశాలల యూనిట్ బాధ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంగీత, ఆర్.సంతోష్‌కుమార్, కె.రఘునాథ్, టి.ప్రతాప్ సింగ్, కె.రమేష్ రెడ్డి, సంతోష్ కుమార్, జె.విజయ్‌కుమార్, జె.తిరుపతి, ప్రభాత్‌రావు, ఎం.స్వామి, జి.చంద్రశేఖర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

'దేశాన్ని తాకట్టు పెడుతున్న కేంద్రం'



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శంకర్


ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టు పెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ విమర్శించారు. పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో నినాదంతో తలపెట్టిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని పట్టణంలోని రాంనగర్ నుంచి ఆదివారం ప్రారంభించారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంపదను కేంద్రం కార్పొరేట్లకు తాకట్టు పెడుతోందని ఎద్దేవా చేశారు. మరోవైపు పేద, మధ్య తరగతి ప్రజలపై అధిక ధరల భారం మోపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, ఎస్.అరుణ్ కుమార్, మండల కార్యదర్శి గంగారెడ్డి, నాయకులు రాజన్న, దేవేందర్, దేవిదాస్, వామన్, అమీనా బేగం, సంగీత, రేఖ, కృష్ణవేణి, షబానా పాల్గొన్నారు.

అయోమయం

- ఈయన పేరు కోస్మెట్టి శ్రీనివాస్. బోథ్ మండలంలోని సొనాల గ్రామం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో గ్రూప్–1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాడు. మెయిన్స్ రాసే సమయంలో తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న శ్రీనివాస్ మెయిన్స్ పరీక్షలకు హాజరుకాలేదు. రాష్ట్రం ఏర్పడిన రెండేళ్లకు గ్రూప్–2 నోటిఫికేషన్ వచ్చింది. అందులో అర్హత సాధించినా ఇంటర్వ్యూలో విఫలమయ్యాడు. తాజాగా ఇటీవల గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు అర్హత సాధించి మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో పేపర్ లీక్ వార్త తీవ్ర నిరాశకు గురిచేసింది. సర్కారు తీరుతో విలువైన కాలంతో పాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు గురి కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఈయన.



- బోథ్ మండలానికి చెందిన ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగిని సెలవు పెట్టి మరీ హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు హాజరైన మరుసటి రోజు నుంచే మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. తాజాగా తీరా పేపర్ లీక్ కావడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. దాదాపు ఆరు నెలలు సెలవు పెట్టడం, హైదరాబాద్‌లో కోచింగ్ కోసం సుమారు రూ.2 లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చిందని ఆమె చెబుతున్నారు.



- ఇటు చదవలేక.. అటు జీవితంలో స్థిరపడలేక
- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల ప్రభావం
- ఆందోళనలో నిరుద్యోగులు

ఉమ్మడి జిల్లాలో..
గ్రూప్–1 పరీక్ష రాసిన అభ్యర్థులు : 12 వేలు
ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారు : 1,123

బోథ్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే తమ పిల్లలకు సర్కారు కొలువులు వస్తాయని తల్లిదండ్రులు కలలు కన్నారు. అయితే తొమ్మిదేళ్లయినా పోలీసు విభాగంలో మినహా ఇతర శాఖల్లో ఆశించిన స్థాయిలో ఉద్యోగాల భర్తీ చేయలేని పరిస్థితి. ఎట్టకేలకు ఈ ఏడాది గ్రూప్–1, 2, 3, 4 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ప్రైవేట్‌లో పనిచేస్తున్న వారు చాలా వరకు తమ జాబ్‌లు వదిలేశారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కొందరు అప్పు చేసి మరీ కోచింగ్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల ఘటన వెలుగుచూసింది. ఇది నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసింది. గ్రూప్–1 ప్రిలిమ్స్‌తో పాటు ఏఈఈ, డీఏవో తదితర పేపర్ లీక్‌ల ఘటనతో ఇక చదివినా ఉద్యోగం రాదని చాలా మంది నిరుత్సాహానికి గురవుతున్నారు.

అభ్యర్థుల్లో సందిగ్ధం..

గ్రూప్–1 ప్రిలిమ్స్, ఏఈ, ఏఈఈ, డీఏవో పరీక్షలకు ప్రభుత్వం మళ్లీ పరీక్ష తేదీలు ప్రకటిస్తున్నా.. అనుకున్న సమయానికి అవి జరిగేది అనుమానమే అనే సందిగ్ధంలో నిరుద్యోగులు ఉన్నారు. ఈ ఏడాది 26 ఉద్యోగ నోటిఫికేషన్లు రాగా వాటిలో ఏడు పరీక్షలు నిర్వహించగా, నాలుగు రద్దయ్యాయి. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారాలపై సిట్ విచారణ పూర్తి కాకపోవడంతో పాటు, మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన పరీక్షలు గందరగోళ పరిస్థితుల్లో రాయాల్సి వస్తుందని నిరుద్యోగ అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోతున్న విద్యార్థులు, నిరుద్యోగులు...

పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 30 ఏళ్లు దాటినా ఇంకా ఉద్యోగం అంటూ చదువుతున్నారు. కొంతమంది పెళ్లిని సైతం వాయిదా వేసుకుంటున్నారు. చివరికి ఇటు ఉద్యోగం రాక, అటు వివాహం కాక అయోమయంలో పడుతున్నారు. ఇదిలా ఉంటే పేదరికంలో ఉండి ప్రైవేట్‌లో పని చేస్తున్న వారు సర్కారు కొలువుపై ఆశతో జాబ్ మానేసి అప్పులు తెచ్చుకుని ప్రిపేరవుతున్న వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది.

తీవ్ర నిరాశలో ఉన్నాం



నోటిఫికేషన్ల కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఒక్కసారిగా వెలువడిన ఉద్యోగాల ప్రకటనతో సంబురపడ్డాం. ఇటీవల గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాను. మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో ప్రిలిమ్స్ పేపర్ లీక్ అయిందని చెప్పడంతో తీవ్ర నిరాశకు లోనయ్యా. నాతో పాటు క్వాలిఫై అయి చదువుతున్న వారందరం అయోమయంలో పడ్డాం. మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తోంది. పేపర్ లీకేజీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన అంశమిది. ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలి. – అజయ్, సొనాల, బోథ్ మండలం

తునికాకు కూలీలకు బోనస్

- అటవీశాఖ కసరత్తు
- బ్యాంక్‌ఖాతాల వివరాలు సేకరణ
- జిల్లాలో 66వేల మందికి ప్రయోజనం



గడిచిన ఎనిమిదేళ్లలో జిల్లాకు సంబంధించిన కూలీలు, వారు సేకరించిన ఆకు కట్టల వివరాలు

సంవత్సరం	ఆకు సేకరించిన కూలీలు	సేకరించిన ఆకు కట్టలు
2015	1,462	3,345
2016	5,278	8,146
2017	5,302	9,182
2018	2,276	3,911
2019	2,440	5,278
2020	1,549	2,632
2021	3,502	7,977
2022	3,656	7,809

66 వేల మందికి లబ్ధి

2015 నుంచి గతేడాది వరకు చేపట్టిన ఆకు సేకరణలో భాగంగా కట్టలకు విక్రయించిన కూలీలందరికీ బోనస్ అందించాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఈమేరకు గడిచిన ఎనిమిదేళ్లలో ఏటా సుమారు 2వేల నుంచి 3వేల మంది కూలీలు ఆకును సేకరించినట్లు అధికారుల వద్ద ఉన్న లెక్కలు చెబుతున్నాయి. మొత్తంగా 66,198 మందికి బోనస్ ప్రయోజనం చేకూరనుంది. ఈ డబ్బులను నేరుగా కూలీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయనున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు కూలీల బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే బోనస్ డబ్బులు జిల్లాకు ఎన్ని రానున్నాయనేది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు.

కైలాస్‌నగర్: తునికాకు సేకరణతో ఉపాధి పొందిన గ్రామీణ ప్రాంత కూలీలకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 50 ఆకుల కట్ట ధరను రూ.3కు పెంచిన ప్రభుత్వం తాజాగా వారికి బోనస్ కూడా చెల్లించాలని భావిస్తోంది. లక్ష్యానికి మించి ఆకుసేకరణ జరగడంతో వచ్చిన లాభాలను కూలీలకు పంచాలని సంకల్పించింది. జిల్లాల వారీగా అర్హులైన వారిని గుర్తించి వారి వివరాలు సమర్పించాలని అటవీ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు అర్హులైన కూలీలతో పాటు వారి బ్యాంకు ఖాతాల వివరాలను సేకరిస్తున్నారు. అయితే చాలా మంది కూలీలకు ఇప్పటికీ బ్యాంకు ఖాతాలు లేకపోవడం, ఇచ్చిన ఖాతాలు సైతం చెల్లుబాటులో లేకపోవడం అటవీశాఖకు తలనొప్పిగా మారింది. దీంతో బీట్ ఆఫీసర్లు నేరుగా కూలీల ఇళ్లకు వెళ్లి వారి మనుగడలో ఉన్న బ్యాంక్ అకౌంట్ వివరాలు సేకరిస్తున్నారు. ఖాతాలు లేనటువంటి వారితో కొత్తగా ఖాతాలను తెరిపిస్తున్నారు. సర్కారు నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా సుమారు 66వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.

ఏటా వేసవిలో ఆకు సేకరణ

ఏటా వేసవిలో అటవీశాఖ తునికాకు సేకరణ షురూ చేస్తుంది. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ఏప్రిల్ నెలాఖరులో ఈ ప్రక్రియ చేపడుతంది. దీంతో జిల్లాలోని అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలు15 నుంచి 20 రోజుల పాటు ఉపాధి పొందుతారు. ఇంటిల్లి పాది అటవీ ప్రాంతానికి వెళ్లి తునికాకు సేకరించి వాటిని కట్టలుగా కట్టి అటవీశాఖ ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు విక్రయిస్తారు. ఏటా సుమారు 1500 నుంచి 3500 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. అయితే లక్ష్యానికి మించి తునికాకు సేకరణ జరగడంతో వచ్చిన లాభాలను కూలీలకు బోనస్‌గా చెల్లించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. తదనుగుణంగా జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ నెలాఖరులోగా విడుదలయ్యే అవకాశం



తునికాకు సేకరణలో పాల్గొన్న కూలీల వివరాలను సేకరిస్తున్నాం. కొంతమంది బ్యాంక్ అకౌంట్స్ వివరాలు తప్పుగా ఉండటంతో అటవీశాఖ సిబ్బంది ఇంటికి వెళ్లి సరైన ఖాతాలను తీసుకుంటున్నారు. జిల్లాలో ఎంత మంది కూలీలు అర్హులనే వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించాం. ఈ నెలాఖరులోగా నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంటుంది. ఇప్పటికీ బ్యాంక్ అకౌంట్స్ వివరాలు ఇవ్వనటువంటి వారు ఎవరైనా ఉంటే తమ పరిధిలోని బీట్ ఆఫీసర్లను సంప్రదించి వెంటనే అందజేయాలి.
– పి. రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి

అందుబాటులోకి వీల్‌చైర్లు, స్ట్రెచర్స్

- స్పందించిన రిమ్స్ డైరెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో వీల్ చైర్స్, స్ట్రెచర్స్ అందుబాటులో లేక రోగులు, వారి బంధువుల అవస్థలను వివరిస్తూ 'వీల్‌చైర్స్ అంతంతే...' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఈమేరకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. వివిధ విభాగాల వార్డులను పరిశీలించి అక్కడున్న వీల్‌చైర్స్, స్ట్రెచర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంను తెరిపించి అందులో ఉన్న వాటిని బయటకు తీపించారు. అవసరాల మేరకు ఆయా విభాగాలతో పాటు ఎమర్జెన్సీ వార్డు వద్ద 24/7 అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.



రిమ్స్ ఎమర్జెన్సీ వద్ద అందుబాటులో ఉంచిన స్ట్రెచర్స్

ఇకపై రోగులను వీల్‌చైర్స్, స్ట్రెచర్స్‌పై పేషెంట్ అటెండెంట్స్ తీసుకెళ్లినట్లు కనిపిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పేషెంట్ కేర్ సిబ్బంది తమకు కేటాయించిన వార్డుల్లో అందుబాటులో ఉండాలన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని సూచించారు.

జోరు పెంచి.. జోష్ నింపి..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముగిసిన 'భట్టి' పాదయాత్ర
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశం
- ఘనంగా వీడ్కోలు పలికిన కాంగ్రెస్ నేతలు



హాజీపూర్ మండలం గుడిపేటలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై సాగుతున్న పాదయాత్రలో భట్టితో మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, పార్టీ కార్యకర్తలు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా పిప్రి వద్ద షురూ అయిన ఈ యాత్ర 31 రోజుల పాటు సాగింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా సాయంత్రం పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఇంటి నుంచి యాత్ర ప్రారంభమైంది. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి భట్టి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉత్సవ విగ్రహంలా ఎమ్మెల్యే..

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మంచిర్యాల అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. గోదావరి బ్యాక్ వాటర్ వచ్చి, రాళ్లవాగు ఉప్పొంగి ఈ ప్రాంతం మునిగిపోయినా నిరాశ్రయులను ఆదుకోకుండా, వారికి పరిహారం ఇవ్వకుండా, ఉత్సవ విగ్రహంలా దివాకర్‌రావు ఉన్నారని విమర్శించారు. స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నా లేకపోయినా ఒక్కటే అన్నారు. పని చేయని ఎమ్మెల్యే మనకు అవసరమా అని ప్రజలను ప్రశ్నించారు. యాత్రలో పాల్గొన్న జనం మాకు అవసరం లేదంటూ నినాదాలు చేశారు. పనిచేసేవారు, ఈ ప్రాంత ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసే నాయకులే మనకు కావాలన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం తపించే నాయకుడు ప్రేమ్ సాగర్‌రావు అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. చేతగాని ఎమ్మెల్యే దివాకర్‌రావు గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని ఎద్దేవా చేశారు.

సమస్యలు తెలుసుకుంటూ...

పాదయాత్రలో భాగంగా మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తాలో దోస, పండ్లు అమ్ముకునే వారిని భట్టి పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేదరివాడలో బుట్టలు, చాటలు తయారు చేసి అమ్ముకునే బొల్లం రజితతో మాట్లాడగా, తాను బీఈడీ చదివానని చెప్పింది. ఎనిమిదేళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక తప్పనిసరి పరిస్థితుల్లో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోగా, డ్వాక్రా సంఘాల నుంచి రుణాలుసైతం ఇవ్వడం లేదని చెప్పింది. వచ్చేఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే కులవృత్తులకు పెద్దపీట వేస్తామని, ఉద్యోగాలుభర్తీ చేస్తామని భట్టి తెలిపారు.

హాజీపూర్ మండలంలో ఘన స్వాగతం..


పాదయాత్ర హాజీపూర్ మండలం వేంపల్లికి చేరగానే స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. భట్టి వెంట డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీటీసీ డేగ బాపు దంపతులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జాతీయరహదారి మీదుగా ముల్కల్ల,గుడిపేట యాత్ర చేశారు. గుడిపేటలో విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత గుడిపేట గోదావరి రోడ్ మీదుగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా భట్టి విక్రమార్క పాదయాత్ర సాగింది. భట్టి పాదయాత్రలో స్థానికులకు అభివాదం చేస్తూ కలిసిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించాలని, నాలుగు వరసల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లు, భూములు కోల్పోకుండా అందరికీ సమన్యాయం జరిగేలా చూడాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై కేక్ కటింగ్..

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 300 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై కేక్ కట్ చేశారు. మత్స్యకారులు భట్టికి చేపల వల అందజేశారు. అనంతరం భట్టి పాదయాత్రకు ప్రాజెక్ట్ వద్ద ఘనంగా వీడ్కోలు పలికారు. పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు భట్టికి జిల్లాలోకి స్వాగతం పలికారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిట్ల సత్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, ఎంపీటీసీ బాలరాజు, నాయకులు సురేందర్, కుమార్‌యాదవ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కోవిడ్

- పెరుగుతున్న కేసులు
- అయినా నిబంధనలు పాటించని జనం
- నిర్ధారణ పరీక్షలకూ వెనుకడుగు
- జిల్లాలో ప్రస్తుతం 12 యాక్టివ్ కేసులు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. అయినా జనం కోవిడ్ నిబంధనలు పాటించట్లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 12 యాక్టివ్ కేసులు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే చాలా మంది లక్షణాలు ఉన్నా నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రెండు, మూడేళ్లుగా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే కోవిడ్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఫస్ట్, సెకండ్ వేవ్‌లో ఈ తీవ్రతను చవిచూసిన విషయం విధితమే. వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చాక చాలా మంది ఫస్ట్, సెకండ్ డోస్ తీసుకున్నారు. దీంతో కేసులు కొంత తగ్గుముఖం పట్టడంతో తర్వాత బూస్టర్ డోస్‌కు చాలామంది ముందుకు రాలేదు. ప్రస్తుతం మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. అయితే జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రక్రియ నిలిచిపోయింది.

అందుబాటులో లేని వ్యాక్సిన్..

జిల్లాలో ప్రస్తుతం వ్యాక్సిన్ నిల్వలు అందుబాటులో లేవు. నెలకు పైగా కేంద్రం నుంచి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇదివరకు కోవిడ్ వ్యాక్సిన్ ఉన్నా తీసుకునేందుకు జనం ముందుకు రాలేదు. వ్యాక్సిన్ తీసుకున్న వారికి గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న వదంతులతో భయాందోళనకు గురవుతున్నారు. వైద్యశాఖ సైతం ఈ విషయంపై అవగాహన కల్పించడం లేదు. జిల్లాలో ఫస్ట్ డోస్5,52,815 మంది వ్యాక్సిన్ తీసుకోగా 101శాతం నమోదైంది. రెండో డోస్ 5,55,884 మంది (101 శాతంగా) తీసుకున్నారు. అలాగే ప్రీకాషన్ డోస్ 2,65,780 మంది తీసుకోగా, 15 నుంచి 18 ఏళ్లలోపు వారు 37,631 మంది వ్యాక్సిన్ వేసుకున్నారు. 12 నుంచి 14 ఏళ్లలోపు వారు మొదటి డోస్ 24,877 మంది తీసుకోగా, రెండో డోస్ 23,534 మంది తీసుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నిర్ధారణకూ వెనుకంజ..

మొదటి, రెండో వేవ్‌లో లక్షణాలు ఉన్నవారు కోవిడ్ టెస్టులు చేసుకునేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో బారులు తీరారు. ప్రస్తుతం రిమ్స్ మినహా అక్కడక్కడా ఒకరిద్దరు కరోనా పరీక్షలు చేయించుకుంటున్నారు. గడిచిన వారం, పది రోజులుగా జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుతం 12 యాక్టివ్ కేసులున్నాయి. వీరిలో 10 మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ఇద్దరు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కరోనాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. మాస్కు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలి. ప్రస్తుతం వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ప్రభుత్వానికి నివేదిక పంపాం. భయపడాల్సిన అవసరం లేనప్పటికీ అప్రమత్తంగా ఉండటం మేలు.
– డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

బాధితుల కోసం ఏర్పాట్లు..

ప్రస్తుతం జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం ఇద్దరు చికిత్స పొందుతున్నారు. లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలి.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. పట్టణంలోని వన్‌టౌన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 14న నిర్వహించిన ర్యాలీలో కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు సృష్టించారని పేర్కొన్నారు. ర్యాలీతో సంబంధం లేకుండా గొడవలకు దిగారని తెలిపారు. పట్టణంలోని పిట్టలవాడకు చెందిన ఎ.సాయికుమార్, మహాలక్ష్మీవాడకు చెందిన తైవర్‌ఖాన్, షేక్ జీషాన్, తాటిగూడకు చెందిన మహ్మద్ షాహిద్, క్రాంతినగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్, మరొకరు అయాన్‌లు దాడి చేశారని పేర్కొన్నారు. వీరిలో నలుగురిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు. దాడికి పాల్పడిన బీజేపీ కార్యకర్త షాహిద్‌కు పాయల్ శరత్‌తో సంబంధం ఉన్నట్లు తెలిపారు. మత ఘర్షణలు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పలు సంఘాలు సోమవారం ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిచ్చాయని, దీనిని జరగనివ్వమని స్పష్టం చేశారు. బంద్ చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై రౌడీషీట్, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు సత్యనారాయణ, పురుషోత్తంచారి, రఘుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమేందర్

తాగి నడిపితే బీమా కట్!

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు
- ఇన్సూరెన్స్ నిబంధనలు కఠినతరం



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై సాయన్న



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్‌రావు(ఫైల్)

నేరడిగొండ(బోథ్): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో నివారణ సాధ్యం కావడం లేదు. తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించడంతో పాటు జైలుకు పంపిస్తున్న విషయం తెలిసిందే. అయినా చాలామంది రోడ్డు నిబంధనలు తుంగలో తొక్కుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపిస్తున్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇకపై మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ (బీమా) రాకుండా చేస్తోంది.

ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ రక్త నమూనాల సేకరణ

ఉమ్మడి జిల్లాలోని ఆయా చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆధారాలు సేకరించడం, ప్రమాదకారకులను గుర్తించడం గతంలో పోలీసులకు చాలా కష్టంగా ఉండేది. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే డ్రైవర్ల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఒకవేళ డ్రైవర్ మృతి చెందితే జీర్ణాశయం నుంచి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబరేటరీకి పంపిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ అయితే ఐపీసీ 304ఏ కింద కేసులు నమోదు చేస్తాం. ఫలితంగా సదరు డ్రైవర్ బీమా సొమ్ము కోల్పోవడం జరుగుతుంది.

ఇవి పాటించకుంటే బీమా రానట్లే..

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేనట్లయితే ప్రమాదానికి లోనైతే బీమా వర్తించదు.
- కారు ప్రయాణం చేసేటప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోతే ప్రమాదం జరిగితే ఏ విధమైన బీమా వర్తించదు.
- సక్రమమైన మార్గంలో వచ్చే వాహనదారుడిపై ఎలాంటి కేసులు నమోదు చేయడం జరగదు.
- రాంగ్‌రూట్‌లో వచ్చేవారితో ఇతరులకు ప్రమాదం జరిగితే ప్రమాదానికి కారకుడైన వ్యక్తి రూ.20 లక్షల పరిహారాన్ని మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే 14 ఏళ్ల జైలుశిక్ష విధిస్తారు.
- ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపి ప్రమాదాలు చేస్తే పై శిక్షలే విధించడం జరుగుతుంది.
- వీరి తరఫున పైరవీ చేసిన వారి డ్రైవింగ్ లైసెన్స్ ఐదేళ్లపాటు రద్దు చేసే అవకాశం ఉంది.

కుటుంబాలకు తప్పని మానసిక క్షోభ

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారు ప్రమాదాల్లో మరణిస్తే ప్రమాద బీమా రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ బాధిత కుటుంబం మానసిక క్షోభకు గురికానున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకులోనైతే తల్లిదండ్రులు, భార్య, పిల్లలు అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మద్యం తాగి వాహనం నడుపుతూ పలువురు జరిమానా కట్టడంతో పాటు జైలుకు వెళ్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో కొందరు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులవుతున్నారు.

ప్రజలదే ప్రథమ కర్తవ్యం..

రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రజలే ప్రథమ కర్తవ్యంగా భావించాలని పోలీసులు పేర్కొంటున్నారు. నిబంధనలను పోలీసులు కచ్చితంగా అమలు చేస్తుండగా కొన్నిసార్లు మానవీయ కోణంలోనూ ఆలోచిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలు నడిపిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించవని సూచిస్తున్నారు. మానవ తప్పిదంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మద్యం సేవించి వాహనాలు నడపడంతో జరిగే అనర్థాలపై ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నాం. యువతను చైతన్య పరుస్తున్నాం. ప్రమాదాలు జరిగిన సమయంలో మానవీయ కోణంలో ఆలోచిస్తున్నప్పటికీ నిబంధనల అమలు కూడా తప్పనిసరి. ఈ మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుంది. ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. – నైలు, సీఐ, ఇచ్చోడ సర్కిల్

నిరుద్యోగులకు సహకారం అందిస్తాం



ఫౌండేషన్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీ నిరుపేద నిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసిన విద్యార్థుల పైచదుల కోసం సహకారం అందించడానికే జై సైవ ఫౌండేషన్ ప్రారంభిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ దుర్గ ప్రశాంత్ అన్నారు. ఆదివా రం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ చేతుల మీదుగా ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజానికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసీ విద్యార్థులకు విద్య, ఉద్యోగ సమాచారం అందించడంతో పాటు వారికి కావాల్సిన సహాయ సహకారం అందిస్తామన్నారు. ఆదివాసీ యువతకు చదువుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యువతకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తుమ్రం లక్ష్మణ్, దుర్వ సంజీవ్, సిడాం నందుకుమార్, మెస్రం సుదర్శన్, ఆత్రం బాపురావ్, దుర్వ కృష్ణ, దుర్వ చంద్రకాంత్, పూలం జైరామ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా బీఎల్వీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన బ్యాక్‌లాగ్ వేకెన్సీస్(బీఎల్వీ–2023) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,927 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,304 మంది హాజరయ్యారు. మరో 623 మంది విద్యార్థులు గైర్హాజర్ కావడంతో హాజరుశాతం 84.14 నమోదైందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పలు పరీక్ష కేంద్రాలను కోఆర్డినేటర్ స్వరూపారాణి పర్యవేక్షించారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం



మంటలు ఆర్పుతున్న రైతులు

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని కుంటాల శివారు ప్రాంతంలో ఓడ్నం కృష్ణకు చెందిన పంటచేనులో విద్యుత్ నిప్పురవ్వలు పడి మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు కృష్ణ ఈ ఏడాది రబీ సీజన్‌లో రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోతకు రావడంతో నూర్పిడి చేసేందుకు పంటచేనులోనే ఉంచాడు. ఆదివారం మధ్యాహ్నం పంట చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఐదు క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధమైంది. అటుగా వెళ్తున్న ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్ రైతుకు సమాచారం అందించడంతో పాటు మంటలు ఆర్పివేశారు.

పలువురిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల్ ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు.

యువతి అదృశ్యం



ప్రియాంక(ఫైల్)

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన తలారి ప్రియాంక (20) నాలుగు రోజుల క్రితం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని తన అక్క తలారి పల్లవి ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి నుంచి కనిపించడంలేదని యువతి బావ దినేష్ ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

వానర ప్రేమికుడు..

చేసేది పోడు వ్యవసాయం.. ఉండేది పెంకుటింట్లో.. కానీ అతని మనసు మాత్రం ఎంతో పెద్దది. మూగ జీవాలపై అతనికి ఉన్న ప్రేమతో ఆరేళ్లుగా వానరులకు ఆకలి, దప్పిక తీరుస్తున్నాడు. అతనే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రానికి చెందిన వాగ్మారే లక్ష్మణ్.

- ఆరేళ్లుగా మూగజీవాలకు సేవ
- ఆకలి, దప్పిక తీరుస్తున్న వాగ్మారే లక్ష్మణ్



వానరాలకు పండ్లు అందిస్తున్న లక్ష్మణ్



డ్రమ్ములో నీళ్లు పోస్తున్న లక్ష్మణ్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వాగ్మారే లక్ష్మణ్ ఆరేళ్ల క్రితం ఒక రోజు కెరమెరి ఘాట్‌పై వానరాలు దాహంకోసం పరితపిస్తుండడాన్ని చూసి చలించిపోయాడు. వాటికి కనీసం నీళ్లయినా అందించి పుణ్యం చేద్దామనుకున్నాడు. అనుకున్నదే అదే తడవుగా 2017 నుంచి కెరమెరి ఘాట్‌పై ఉన్న వానరాలకు వర్షాకాలం మినహా అన్నికాలాల్లో రోజుకు రెండుసార్లు నాలుగు క్యాన్లలో నీటిని తీసుకెళ్లి వాటి దాహం తీరుస్తున్నాడు. అంతేకాకుండా వివిధ రకాల పండ్లను సైతం తీసుకెళ్లి వాటి ఆకలి తీరుస్తున్నాడు. కెరమెరి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఘాట్ వద్దకు బస్సులేదా ఆటోల్లో వెళ్తున్నాడు. మూగజీవాల ఆకలి, దప్పిక తీరుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

వర్షాకాలం మినహా...

మండల కేంద్రానికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్‌కు కేవలం ఎకరం పోడు వ్యవసాయం మాత్రమే ఉంది. మరో పదెకరాల వరకు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అతని సంపాదనలో నుంచి అధికభాగం ఈ మూగజీవాలకే పెడుతున్నాడు. తన సతీమణి అనసూయ వద్దని ఎంత వారించినా వినకుండా వర్షాకాలం మినహా అన్నికాలాల్లో రోజుకు సుమారు రూ.400 నుంచి 500 వరకు వాటికోసం ఖర్చు చేస్తున్నాడు. రోజూ నాలుగు క్యాన్లలో నీళ్లు, టమాటాలు, అరటిపండ్లు, పుచ్చకాయలు, పుట్నాలు, పల్లీలు, సపోటాలతో పాటు ఇతర పండ్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు.

అదృష్టంగా భావిస్తున్నా



నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ వనరుల దప్పిక, ఆకలి తీరుస్తా. ఆరేళ్లుగా వాటికి సేవ చేస్తున్నా. ప్రతీరోజు బస్సు లేదా ప్రైవేటు వాహనాల్లో పండ్లు, ఫలాలు, నీటిని తీసుకెళ్తా. రాముని దూతలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.
– వాగ్మారే లక్ష్మణ్, కెరమెరి, ఎస్సీకాలని

వేసవి దుక్కులతో ఎంతోమేలు



పత్తి చేనులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

- పెరుగనున్న భూసారం
- అధిక దిగుబడులు



జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: పత్తి ఏరిన తరువాత రైతులు పత్తి కర్రలను కాలుస్తున్నారు. అంతే కాకుండా వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఈ వేసవి దుక్కులతో కూడా మంచి లాభాలు ఉన్నాయని ఏడీఏ జాడి బాపు పేర్కొన్నారు. సరిపడా తేమ ఉన్న పొలాల్లో సుమారు తొమ్మిది అంగుళాల లోతుకు తగ్గకుండా దుక్కులు చేసుకోవడంతో ప్రయోజనం ఉంటుందని ఆయన వివరించారు.

వేసవి దుక్కులతో లాభాలు

లోతు దుక్కులు దున్నినప్పుడు నేల పైపొరలలో ఉండే పురుగులను, తెగుళ్లను నశింప జేయడానికి అవకాశం ఉంటుంది. నేలను లోతుగా దున్నినప్పుడు నేలలో దాక్కునే లేదా నిద్రావస్థలో ఉండే పురుగులు, నేలలో ఉండి తెగుళ్ల కలుగజేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకుతుంది. ఏప్రిల్, మే నెలల్లో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు ఈ పురుగులు, శిలీంద్రాలు నశిస్తాయి. కాబట్టి తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. తుంగ, గరిక, దర్భ, జమ్ము వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలాలలో పెరిగి పంటలకు నష్టం కలిగిస్తుంటాయి. వీటి వేర్లు, దుబ్బులు, కాయలు నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ చాలా కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కలు, కాయలు, వేర్లు, దుంపలు, పెకిలించబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు నశించే అవకాశం ఉంటుంది. నేల పైకి తేలిన కాయలు, దుంపలు, వేర్లను ఏరివేసి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దుక్కిదున్ని తొలకరి వర్షాలకు గొర్రు గుంటుకలతో దున్నినప్పుడు నేల బాగా గుల్లబారుతుంది. తొలకరిలో వేసే పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటుక, దంతెలు వంటి పరికరాలు నేల లోపలికి 3 నుంచి 5 అంగుళాల లోతు వరకు చొచ్చుకుపోతాయి. నేల లోపల గట్టి పొర ఏర్పడుతుంది. దీనివల్ల నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కాబట్టి నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదింపబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది. పంట కోత తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిద సేంద్రియ పదార్థాలన్నీ వేసవిలో లోతుగా దుక్కి దున్నడంతో నేలలో కలిసి కుళ్లిపోతాయి. దీనివలన నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరగడానికి అవకాశం ఉంటుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడంతో పొలంలో కలుపు, గత పంట మొదళ్లు లేకుండా శుభ్రంగా ఉంటుంది. అందువల్ల తొలకరి వర్షాలకు నేలలో గొర్రు, గుంటుకలతో దున్నుకుని తొలకరి పంటలను ఆలస్యం లేకుండా తొందరగా విత్తుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ వేసవి కాలంలో పంటలు పూర్తయిన వెంటనే పొలాలు, చేన్లను లోతు దుక్కి చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వేసవి దుక్కులతో ముందుగా భూమి వదులుగా అవుతుంది. దీంతో భూమిలోపల ఉన్న చెడు క్రిమి కీటకాలు పూర్తి నశించి పోయి, తొలకరి జల్లులు కురిసినప్పుడు, నీరు భూమిలోకి ఇంకి పోతుంది. దీంతో అధిక వర్షం కురిసినా భూమి కోతలకు గురికాకుండా ఉంటుంది. పత్తి గింజలు వేసిన తర్వాత మొలకలు అక్కడక్కడా కాకుండా అంతటా ఒకే రకంగా మొలుస్తాయి. మొలక శాతం పెరుగుతుంది. సకాలంలో పంటలు వేసుకునేందుకు వీలుగా ఉంటుంది. సారవంతమైన ఉపరితల నేల వృధా కాకుండా ఉండి పోతుంది. గాలి భూమి పొరల్లోకి వెళ్లి మొక్కల వేర్ల వ్యవస్థ విస్తరిస్తుంది. దీంతో మొక్కలు బలంగా తయారవుతాయి. అంతే కాకుండా భూమిలో మొక్కలకు ఉపయోగపడే క్రిమి కీటకాలు తయారై మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతాయి. దీంతో దిగుబడులు బాగా ఉండి సకాలంలో పంటలు చేతికొస్తాయి.

'పాయల్' తనయుడి ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని హల్‌చల్
- కేసులో ఇరికించేందుకు డీఎస్పీ కుట్ర అని ఆరోపణ
- నేటి బంద్ జయప్రదం చేయాలని శరత్ పిలుపు



పాయల్ శరత్‌ను పోలీసు వాహనం నుంచి దించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ తనయుడు పాయల్ శరత్ (బన్ని) తన ఇంటి ఎదుట పోలీసుల సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించిన డీఎస్పీ ఉమేందర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన ఘర్షణకు బాధ్యులైన యువకులతో పాయల్ శరత్‌కు సంబంధం ఉందని పేర్కొనడం వివాదానికి దారి తీసింది. డీఎస్పీ వ్యాఖ్యలను తప్పుబడుతూ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయనను ప్రశ్నించేందుకు వన్‌టౌన్‌కు వెళ్లిన శరత్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఆయనను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు. పట్టణంలోని పలు వీధుల గుండా తిప్పుతూ జాతీయ రహదారిపైకి ఎక్కించారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు పోలీసు వాహనాన్ని వెంబడించడంతో తిరిగి ఆయనను శాంతినగర్‌లోని తన ఇంటివైపు తీసుకొచ్చారు. వాహనం నుంచి దింపేందుకు యత్నించగా ఆయన దిగకుండా నిరసనకు దిగారు. తనను అకారణంగా తప్పుడు కేసులో ఇరికిస్తున్నారని పేర్కొంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అప్రమత్తమైన పోలీసులు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలతో పాటు సాయుధ బలగాలను రంగంలోకి దించారు. దాదాపు గంటకు పైగా హైడ్రామా నెలకొంది. చివరకు వాహనంలో నుంచి శరత్ దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ర్యాలీలో జరిగిన ఘర్షణలో తమ పార్టీ కార్యకర్తలు, తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన కూతురిపై ప్రమాణం చేశారు. తనకు ఫోన్ చేసి రౌడీ షీట్ ఓపెన్ చేయడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తానని, రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తానని డీఎస్పీ బెదిరించినట్లు తెలిపారు.

ఆదిలాబాద్ బంద్ విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: అంబేద్కర్ జయంతి ర్యాలీ సందర్భంగా హిందూ యువకులపై దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. దళిత గిరిజన సంఘాలు, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయాలపాలైన ప్రభాకర్‌రావు

లోకేశ్వరం(ముధోల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ప్రభాకర్‌రావు పని నిమిత్తం స్కూటీపై నందిపేట్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ధర్మోర భారత్ పెట్రోల్ బంకు ప్రాంతంలో టిప్పర్‌ను ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని 108లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రభాకర్‌రావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాల పాలైన సంఘటన బెల్లంపల్లి మండలం కన్నాల శివారు జాతీయ రహదారి పై చోటు చేసుకుంది. స్థానికులు, తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం కాసిపేట మండలం వరిపేట గ్రామానికి చెందిన పోలవేణి రాములు, సిడం పెద్దయ్య ద్విచక్ర వాహనంపై బెల్లంపల్లి నుంచి తాండూర్‌కు వెళ్తుండగా మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు కుడి కాలు తెగిపోగా పెద్దయ్యకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామ శివారులోని పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి రూ.68 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పెన్‌గంగలో పడి యువకుడు మృతి

సిర్పూర్(టి): ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని హుడ్కిలిలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చౌదరి కైలాస్ (25) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పాటు ఫిట్స్‌తో బాధపడతున్నాడు. ఈ నెల 15న పెన్‌గంగ సమీపంలో ఉన్న పంటచేనుకు వెళ్లిన కైలాస్ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పెన్‌గంగనది ఒడ్డున చెప్పులు కనిపించాయి. నదిలో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. మృతుని తండ్రి చౌదరి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి బాలుడు మృతి



మౌర్యతేజ మృతదేహం

జన్నారం(ఖానాపూర్): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తానాజీ నాయక్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముడికె గోపాల్, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో పెద్ద కుమారుడు ముడికే మౌర్యతేజ (12) జన్నారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు సమీపంలోని వాగు వద్దకు వెళ్లారు. వాగులో లోతు ఎక్కువగా ఉండడంతో మడుగులో స్నానం చేసేందుకు సిద్ధమయ్యారు. ముందుగా మౌర్యతేజ మడుగులోకి దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు వెంటనే గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో నీటిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై తానాజీ నాయక్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

సిర్పూర్(టి): మనస్తాపంతో మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నవేగాంలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం నవేగాం గ్రామానికి చెందిన కుత్తర్‌వార్ పరశురాంకు కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన ఉషతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇప్పటికీ సంతానం లేకపోవడంతో మనస్తాపానికి గురైంది. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం మృతురాలి తండ్రి హుల్కే దేవాజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోధుమకు దక్కని 'మద్దతు'



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు బొంత శ్రీధర్ రెడ్డి. తాంసి మండల కేంద్రానికి చెందిన ఈయన యాసంగిలో మూడెకరాల్లో గోధుమ సాగుచేశాడు. దాదాపు 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట విక్రయించేందుకు జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేక ఆరబెట్టి ఇంటి ఆవరణలో నిల్వ చేసుకున్నాడు. విక్రయిద్దామని దళారులను ఆశ్రయిస్తే క్వింటాల్ రూ.1900 చెల్లిస్తానని అనడంతో ఒప్పుకోలేదు. గోధుమలు అవసరం ఉన్నవారికి క్వింటాల్ రూ.2 వేలకు విక్రయిస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా రైతులందరి పరిస్థితి ఇదీ.



కజ్జర్ల శివారులో గోధుమ పంట సాగు

- దిగుబడి ఉన్నా ధర కరువు
- ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్న రైతులు
- పంట విక్రయించేందుకు మార్కెట్ సౌకర్యం లేక..
- దళారులకు విక్రయిస్తున్న అన్నదాతలు

తాంసి: జిల్లాలో యాసంగి సీజన్‌లో జొన్న, శనగతోపాటు రైతులు అధికంగా గోధుమ పంటలు సాగు చేశారు. ఈ ఏడాది గోధుమ పంటకు దిగుబడి ఉన్నా పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం లేక ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కడం లేదు. క్వింటాల్ ధర రూ.2125 ఉండగా తక్కువ ధరకే దళారులకు పంటను విక్రయించి నష్టపోతున్నారు. మరికొందరు ఇళ్లలోనే నిల్వ చేసి క్వింటాల్ రూ.2వేల చొప్పున విక్రయిస్తున్నారు.

జిల్లాలో..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3,050 ఎకరాల్లో రైతులు గోధుమ సాగుచేశారు. తాంసి, భీంపూర్, తలమడుగు, జైనథ్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల్లో అధికంగా సాగైంది. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు.

ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో గోధుమ పంటకు మార్కెట్ సౌకర్యం లేక ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. పంట సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గతేడాది 4700 ఎకరాల్లో సాగుచేయగా ఈ ఏడాది 3,050 ఎకరాల్లో సాగైంది. దాదాపు 1500 ఎకరాల్లో రైతులు పంట సాగు చేయడాన్ని తగ్గించారు. మార్కెటింగ్ సౌకర్యం లేకనే పంట విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కొనుగోళ్లకు మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేస్తే సాగువిస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు గోధుమ పంట విక్రయానికి మార్కెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



తనకున్న రెండెకరాల్లో గోధుమ సాగు చేస్తే 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటను దాదాపు 15రోజుల వరకు ఇంట్లో నిలవ చేశా. మార్కెటింగ్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నాం. ప్రైవేట్‌లో విక్రయిద్దామంటే తరుగు, తేమ పేరిట కోతలు విధిస్తున్నారు. ఇళ్లలో నిల్వ చేసి రూ.2100 చొప్పున విక్రయిస్తున్నా. ఇప్పటికైన మార్కెట్ సౌకర్యం కల్పించాలి. – గడ్డం సురేందర్ రైతు తాంసి

ఆర్థికంగా నష్టపోతున్నారు



జిల్లాలో గోధుమ పంట విక్రయించడానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. రైతులు పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధరతో కొనుగోళ్లు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. – ఉమాకాంత్ రెడ్డి భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు, తాంసి

యథేచ్ఛగా రోడ్ల కబ్జా

- బేలలో హైవేకు అనుసంధానంగా ఉన్న రెండు రోడ్లు
- 20 ఫీట్లపై అక్రమ నిర్మాణాలు
- కన్నెత్తి చూడని పంచాయతీ పాలకవర్గం
- ఇంటి నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు



సర్వే నంబర్ 44లో 20ఫీట్ల రోడ్డుపై అక్రమ నిర్మాణం

బేల: ప్లాట్ల ధరలు పైపైకి పెరగడంతో అక్రమార్కుల అండదండలతో యథేచ్ఛగా రోడ్లు కబ్జా అవుతున్నాయి. బేలలో నేషనల్ హైవే 353బికు అనుసంధానంగా ఉన్న 20 ఫీట్ల రెండు రోడ్లు కబ్జా అయ్యాయి. కొందరు అక్రమ నిర్మాణాలు చేసుకున్నారు. దీంతో రోడ్లు నేషనల్ హైవే వైపు మూసుకుపోయాయి. దీనిపై పంచాయతీ పాలకవర్గం కన్నెత్తి చూడడం లేదు. అక్రమ నిర్మాణాలకు పంచాయతీ నుంచి జారీఅయిన ఇంటి నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మరికొందరు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుని, కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. ఈ రోడ్ల కబ్జాతో 9 కుటుంబాలకు రాకపోకలకు వీలు లేకుండా పోతుందని, దీనిపై స్థానిక గ్రామ పంచాయతీలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు పేర్కొంటున్నారు.

రెండు రోడ్ల కబ్జా ఇలా..

బేలలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో నేషనల్ హైవే 353బికు అనుసంధానంగా ఉన్న సర్వే నంబర్ 41 లేఅవుట్‌లోని 180 ఫీట్ల పొడవు, 20 ఫీట్ల వెడల్పుతో ఓ రోడ్డు నేరుగా నిదానంగా హైవేకు కలుస్తుంది. ఈ రోడ్డులో దాదాపు 90 ఫీట్ల పొడవు వరకు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసుకున్నారు. రోడ్డుకు ఇంకా కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ రోడ్డుకు మరో సర్వే నంబర్ 44 లేఅవుట్‌లోని 100 ఫీట్ల పొడవు 20 ఫీట్ల వెడల్పు మరో ప్రభుత్వ సీసీ రోడ్డు కలిసేచోట 40 ఫీట్ల పొడవు వరకు కబ్జా చేసి నిర్మాణాలను అక్రమంగా నిర్మించుకున్నారు.

ఇంటి నంబర్లతో..

ఈ రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేయడంతో రాకపోకలకు వీలు లేకుండా మారిందని బాధితులు పేర్కొంటున్నారు. ఆపై ఈ రోడ్డు కబ్జాలకు నివాసం ఉంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి నుంచి జారీ అయిన ఇంటి నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు సైతం చేసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 41/బి లేఅవుట్‌లోని ఈ రోడ్డు కబ్జాను 39/60, 14/39, 15/30స్క్వేర్ ఫీట్ల ప్లాట్లుగా సర్వే నంబర్ 44 వారసులతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు బాధితులు అంటున్నారు. ఈ దందాలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై కార్యదర్శి సురేష్‌ను సాక్షి వివరణ కోరగా సర్వే నంబర్ 41/బి, 44అక్రమ లేఅవుట్ల రికార్డులు పరిశీలిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్లపై కబ్జాలను తొలగించాలని ఫిర్యాదు

ఇందిరానగర్ కాలనీలోని సర్వేనంబర్ 41/బి, 44లేఅవుట్‌లలోని రెండు రోడ్ల కబ్జాలను తొలగించాలని ఆదివారం స్థానిక పంచాయతీ కారద్యర్శి సురేష్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. జావిద్ ఖురేషీ, కిరణ్‌కుమార్, దకాతే ఆనంద్‌రావు, అఖిల్ ఖురేషి, షబ్బీర్, కిశోర్, తోఫిక్ ఉన్నారు.

రాకపోకలకు వీలు లేకుండా కబ్జా

ఇందిరానగర్ కాలనీలో ఇంటి వెనుక వైపు ఉన్న ప్రభుత్వ సీసీ రోడ్డు కబ్జాకు గురైంది. దీంతోపాటు ఇంటి ఎదుట నుంచి ఉన్న రోడ్డు హైవే వైపునకు పూర్తిగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసుకున్నారు. ఇప్పుడు మరో వైపు స్తంభాలు వేసి కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాకపోకలకు వీలు లేకుండా ఉంది. – షబ్బీర్, బేల

చర్యలు తీసుకోవాలి

ఇందిరానగర్ కాలనీలోని రోడ్ల కబ్జాపై గ్రామ పంచాయతీలో రెండేళ్ల నుంచి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సర్పంచ్, కార్యదర్శులు మాకు సంబంధం లేదని చెబుతున్నారు. పంచాయతీ పెద్ద అఫీసర్లు స్పందించి, రోడ్లపై అక్రమ కబ్జాలపై చర్యలు తీసుకోవాలి. – అఖిల్ ఖురేషి, బేల

క్లుప్తంగా

టీడీసీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఉట్నూర్‌రూరల్: టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీడీసీ) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గెల్లుశ్రీనివాస్ యాదవ్‌ను హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. నాయకులు శివకుమార్, ప్రశాంత్,సాయి, సామల రాజన్న తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: చాందా (టి) గ్రామంలో అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు తెలిపారు. అధ్యక్షుడిగా పోతరాజు శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా షిండే అనిల్, తారుడి శంకర్, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ శ్రీకాంత్, కోశాధికారిగా రెంజర్ల రాజు, భగత్ సాయి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బొజ్జ సాయి, సాకిపెల్లి రాకేశ్, సంయుక్త కార్యదర్శులుగా మునేశ్వర్, అశోక్, రెంజర్ల సిద్దు, స్పోర్ట్స్ ఇన్‌చార్జీగా తారుడి ప్రవీణ్, భగత్ ప్రశాంత్, కమిటీ ఇన్‌చార్జీలుగా తారుడి అభిలాష్, బొజ్జ రాకేశ్, బ్లడ్ డొనేషన్ ఇన్‌చార్జీగా బొజ్జ సురేష్, తారుడి అనిల్, లైబ్రరి ఇన్‌చార్జీగా రెంజర్ల సాయికృష్ణ, బొజ్జ సాయికృష్ణ, కల్చరల్ ఇన్‌చార్జీలుగా సాకెపల్లి నందు, బొజ్జ గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తారుడి హనుమంతు, సాకిపెల్లి దేవన్న, సాకిపెల్లి వెంకటేశ్, ముఖ్య సలహాదారుగా బొజ్జ అడేల్లు, దుమాల అశోక్, బిక్కి దేవిదాస్, భగత్ విఠల్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

'ఏలేటి'ని కలిసిన నాయకులు



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజుయాదవ్

బోథ్: బీజేపీలో చేరిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్ హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఏలేటి చేరికతో బీజేపీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

21న నారాయణ బాబా సంస్థానం వార్షికోత్సవం

బేల: మండలకేంద్రంలో ఈనెల 21న సచ్చిదానంద సద్గురు నారాయణ బాబా సంస్థానం 5వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని సర్పంచ్ ఇంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా మహాయజ్ఞం, మహా అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ యజ్ఞానికి ఆయా పార్టీల నాయకులు, రైతులు, వ్యాపారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సంస్థానం ప్రతినిధులు కోవ విజయ్, పుసాం రాజేశ్వర్, దత్తు, యాదవ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలకు విద్యార్థి ఎంపిక



సుజయ్

బోథ్: కంచి కామకోటి పీఠం వేదపాఠశాలలో బోథ్ మండల కేంద్రానికి చెందిన పండితుడు నెమలికొండ సంతోష్ కుమారుడు సుజయ్ సీటు పొందారు. ఈనెల 14న తిరుపతిలో జరిగిన ప్రవేశపరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించాడు.

'మహిళా సమ్మాన్' సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న రమేశ్

నార్నూర్: తపాలాశాఖలో అమలు చేస్తున్న మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ ఎంవో గుగ్లోత్ రమేశ్ కోరారు. మండలంలోని ఖైర్‌డట్వా గ్రామంలో ఆదివారం మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకం కాలవ్యవధి రెండేళ్లు, కనిష్ఠంగా రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చునని అన్నారు. వడ్డీ రేటు 7.5% ఏడాదికి, రెండేళ్ల తర్వాత అసలు, వడ్డీ కలిపి ఇస్తారని తెలిపారు. బీపీఎంలు ప్రవీణ్, సంగీత, రాందాస్, జైవంతరావు రాథోడ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని కామగిరి గ్రామంలో ఆదివారం పర్యటించారు. ముందుగా కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.2 లక్షల సీడీపీ నిధులతో డ్వాక్రా మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు రూ.2 లక్షల సీడీపీ నిధులతో నిర్మిస్తున్న సవారీ బంగ్లా నిర్మాణ పనులను పరిశీలించారు. కాగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తొడసం భీంరావ్, ఉప సర్పంచ్ కడదారపు సుజాత, బీఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంద్ర వెంకటరమణ, నక్కల రమణారెడ్డి, మనోహర్, గ్రామపటేల్ జాజ్జిక్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లచ్చిరాం సేవలు చిరస్మరణీయం

నేరడిగొండ: బంజారా సమాజ చైతన్యంతోపాటు సమాజం కోసం పాటుపడిన రాథోడ్ లచ్చిరాం చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన లచ్చిరాం నాయక్ ఇటీవల మృతిచెందగా ఆదివారం నిర్వహించిన పెద్దకర్మకు హాజరయ్యారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామారావు మహరాజ్ మనుమడు శేఖర్ మహరాజ్, టీఎస్‌జీవో అధ్యక్షుడు అజ్మీరా శ్యామ్‌నాయక్, ఎంపీపీ రాథోడ్ సజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జాదవ్ కృష్ణనాయక్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా తెలంగాణ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సైతం లచ్చిరాం పెద్దకర్మకు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 తండాల నుంచి వచ్చిన నాయకులు, కరోబారిలు నాయక్ పరంపర కొనసాగింపుగా లచ్చిరాం పెద్ద కుమారుడు యశ్వంత్‌కు పగిడి కట్టడం అభినందనీయమన్నారు. అనంతరం యశ్వంత్‌ను సన్మానించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షకు తరలిరావాలి

బోథ్: ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్వర్యంలో సోమవారం జరిగే ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షకు కార్యకర్తలు తరలిరావాలని నియోజకవర్గ నాయకుడు ఆడే గజెందర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రజాస్వామ్య రక్షణ దీక్షకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీమంత్రి షబ్బీర్ అలీ, జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, మాజీ విప్ ఈరవత్రి అనిల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ హాజరవుతారని అన్నారు.

శనగ కొనుగోళ్లు బంద్

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న శనగ కొనుగోలు కేంద్రం మూసివేసినట్లు పీఏసీఎస్ సీఈవో గంగన్న తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 85,374 క్వింటాళ్ల శనగలు రైతుల నుంచి కొనుగోళ్ల చేపట్టామని పేర్కొన్నారు. కాగా ఆదివారం నుంచి పూర్తి స్థాయిలో శనగ కొనుగోళ్లు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన బడే అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బాలూరి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.7వేల ఆర్థికసాయం అందజేశారు. కరుణాకర్ రెడ్డి, భూపతిరెడ్డి ఉన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: పేద ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందం కలిగిస్తుందని సంగెం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుధీర్‌కుమార్ సంగెం అన్నారు. పట్టణంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 108 వారాలుగా పేద ప్రజలు, యాచకులకు అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు. మినర్వ ఇండస్ట్రీ అధినేత అన్వర్, అల్ ఇండియా రేడియో ఉద్యోగి పోచన్న పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సలీమ్, సుభాశ్, పవన్, న్యాయవాది నరేందర్, శేఖర్, సురేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవాలను జీర్ణించుకోలేకే అల్లర్లకు యత్నం'



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జీర్ణించుకోలేకనే అల్లర్లకు యత్నించారని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ జిల్లా నాయకుడు ఉమ్రే నితిన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన, 14న అన్నిపక్షాలను ఏకం చేసి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించామన్నారు. దీన్ని జీర్ణించుకోలేని మతోన్మాద శక్తులు కుట్రలకు తెరలేపారని అన్నారు. అల్లర్లకు కారకులైన వారిని పోలీసు శాఖ గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఎదులాపురం: ఉత్సవాలను అన్ని వర్గాలు కలిసికట్టుగా కనివినీ ఎరుగని రీతిలో ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు సహకరించిన వారికి ధన్యవాదాలు

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవంతోపాటు విగ్రహ ఆవిష్కరణను ఘనంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, జయంతి వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ఐక్యంగా ఉంటూ ప్రతి ఒక్కరూ హక్కులు సాధించుకోవాలన్నారు. ర్యాలీలో దాడి ఘటన జరగడం బాధకరమన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు భరత్ వాఘ్మరే, శైలేందర్ వాఘ్మరే, రత్నజాడే ప్రజ్ఞకుమార్, బాబాసాహెబ్ కాంబ్లే, మల్లెల స్వామి, బొజ్జ అడేల్లు, అల్లూరి భూమన్న, శోభబాయి, చంద్రకళబాయి, దుర్వ నగేష్, చిక్కాల దత్తు, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా జరుపుకోవాలి



రంజాన్ కిట్లను అందజేస్తున్న రాంచంద్రారెడ్డి

కైలాస్‌నగర్: పేదలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే తమ వంతుగా సహకారం అందిస్తున్నామని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిల్కూరి రాంచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్ కాలనీలో పేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు పండుగల నిర్వహణ కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో 12 ఏళ్ల నుంచి కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ పట్టణంలోని 70 శాతం పేదలకు పక్కా ఇళ్లు కట్టించామని గుర్తు చేశారు. అనంతరం పార్టీ నాయకులు బొక్కల్‌గూడ, గాంధీనగర్, సంజయ్‌నగర్ కాలనీల్లోని పేదలకు ఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి సంజీవ్ రెడ్డి, అంబకంటి అశోక్, సైద్‌ఖాన్, నహీద్, వసీం తదితరులు ఉన్నారు.

'అమరుల సంస్మరణ' శాంతియుతంగా నిర్వహిస్తాం



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఈనెల 20న అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే ఆదివాసీ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహిస్తామని ఆదివాసీ సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, తొడసం నాగోరావ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సీహెచ్ నాగేందర్‌కు వినతిపత్రం అందించారు. ఏప్రిల్ 20న ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తామన్నారు. పోలీసులు తమకు సహకరించాలని కోరారు. ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం నాగ్‌నాథ్, సోయం రాందాస్, గేడం భరత్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఇఫ్తార్



పాల్గొన్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రంజాన్ మాసం పురస్కరించుకుని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కొమ్ము విజయ్, ఆదివాసీ యువ నాయకుడు దుర్వ మహేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇందులో మైనార్టీలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు చంద్రయ్య, నాయకులు పుర్కబాపురావు, సర్పంచ్ సునీల్, కలీం మౌలానా, జుబేర్, అబ్రార్, ఇబ్రాహీం సలీం పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: హర్కపూర్‌తండా ఉప సర్పంచ్ రాథోడ్ రాధికసంజీవ్‌నాయక్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జామ మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్‌తోపాటు మహ్మద్ మసుద్, సుఫీయన్ తదితరులు పాల్గొన్నారు.

'డబ్బులు ఇవ్వలేదనే అరెస్టు'

బోథ్: మండలంలోని చింతలబోరి గ్రామంలో మాధవ్ ఇంట్లో కలపను అటవీ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కాగా, మాధవ్ సోదరుడు సత్యనారాయణ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మాధవ్ ఇంట్లో ఎలాంటి కలప లేదని, అయినా అటవీ అధికారులు కేసులు నమోదు చేశారన్నారు. మీకు దళిత బంధుడు వచ్చింది కదా అందులో నుంచి రూ.2 లక్షల ఇవ్వాలని అధికారులు అడిగారని ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక ఫారెస్ట్ అధికారి ప్రవీణ్‌ను వివరణ కోరగా పక్కా సమాచారంతో మాధవ్ ఇంట్లో దాడి చేశామని అందులో కలప లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఇతనిపై గతంలో 2018, 2020లో కలప స్మగ్లింగ్ కేసులు నమోదయాయని అన్నారు. వారి కుటుంబీకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో నీటి కటకట



చికిత్స కోసం వచ్చిన విద్యార్థులు



నిరుపయోగంగా తాగునీటి పరికరం

- ఇబ్బందులు పడుతున్న రోగులు

నేరడిగొండ: నేరడిగొండ పీహెచ్‌సీలో గత నాలుగు రోజులుగా నీటి కటకట ఉంది. ఆదివారం రాత్రి 8.40 గంటలకు 'సాక్షి' పీహెచ్‌సీని విజిట్ చేయగా వైద్య చికిత్సల కోసం వచ్చిన ప్రజలు నీరు లేదని వాపోయారు. అలాగే అక్కడ ఉన్న వైద్యసిబ్బంది సైతం గత నాలుగు రోజుల నుంచి నీటి సౌకర్యం లేదని, మోటార్ మరమ్మతుకు గురైందని తెలిపారు. అయితే ఇటీవల 'సాక్షి'లో వస్తున్న కథనాలకు జిల్లా అధికారులు వచ్చి తనిఖీ చేసి వెళ్తున్నారు. కానీ ఈ సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ మాతృమూర్తి లక్ష్మిబాయి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. మండలంలోని శ్యాంపూర్‌లో ఎంపీపీ జైవంత్‌రావు, నాయకుడు ప్రభాకర్ ఆయన్ను పరామర్శించారు. నాయకులు రవీందర్, ముజీబ్, జుబేర్ ఖాన్, అబ్రార్ ఖాన్, స్వామి, హరీశ్, గ్రామస్తులు ఉన్నారు.